

ఆకస్మిక తనిఖీ
తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ప్రయివేటు ఎర్రచందనం డిపోలను టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. - 8లో



జీవితం ఉన్నతికి సోపానం
సంస్కారంతో పాటు విలువలతో కూడిన జీవితం ఉన్నతికి సోపానమని ఎస్వీయూ వీసీ వీ.శ్రీకాంత్ తెలిపారు. - 8లో



కురిసింది వాన!
చుర్రుచుమ్మెత్తిస్తున్న ఎండ ఎట్టకేలకు చల్లబడింది. గురువారం తిరుపతిలో చిరు జల్లులు కురవడంతో కాస్త ఉపశమనం కలిగింది.

న్యూస్‌రీల్

విధులకు హాజరుకావాల్సిందే



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ: ఎన్నికల విధుల నిర్వహణలో పీఓ, ఏపీఓలు ప్రమత్తంగా ఉండాలని, విధులు కేటాయించిన ప్రతి ఉద్యోగి హాజరు కావాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం పద్మావతి మహిళా వర్సిటీలోని ధృతి ఆడిటోరియంలో చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పీఓ, ఏపీఓల శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలలో సమస్య ఏర్పడితే వెంటనే సెక్టోరల్ అధికారికి సమాచారం అందించాలని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గానికి సంబంధించి ఓటరు స్లిప్పులు బీఎల్‌ఓలకు అందజేశామని, వారు నిర్ణీత సమయంలోపు ఓటరుకు అందజేయాలని ఆదేశించారు. చంద్రగిరి ఆర్‌ఓ నిషాంత్‌రెడ్డి, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

92,79 శాతం మందికి పింఛన్లు

తిరుపతి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 92.79 శాతం పూర్తయినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. మొత్తం 69,522 మంది లబ్ధిదారులకు గాను 64,506 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. రూ.20,21,73,000లకుగాను బుధ, గురువారాల్లో రూ.18,79,05,000 లబ్ధిదారులకు అందజేసినట్టు పేర్కొన్నారు. శుక్రవారానికి వంద శాతం పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేడు డయల్ యువర్ ఈఓ

తిరుమల: డయల్ యువర్ ఈఓ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుపతి టీటీడీ పరిపాలనా భవంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు టీటీడీ పేర్కొంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు వెల్లడించింది. భక్తులు తమ సందేహాలు, సూచనలను టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలపవని సూచించింది. భక్తులు 0877–2263261 నంబర్‌లో సంప్రదించాలని టీటీడీ పేర్కొంది.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,510 మంది స్వామివారిని దర్శించుకోగా 30,441 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.62 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రతిపక్షాల కక్ష.. పండుటాకులకు శిక్ష



నాగలాపురం బ్యాంక్ వద్ద నిరీక్షిస్తున్న అవ్వాతాతలు

దివ్యాంగులు, పండుటాకులపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన అనుచరులు కక్షగట్టారు. కుట్రపూరితంగా వలంటీర్ వ్యవస్థపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. దీంతో ఎన్నికల కమిషన్ వలంటీర్ వ్యవస్థను పక్కనబెట్టింది. ఇంటికే చేరుతున్న పింఛన్ అందకుండా పోయింది. రెండు నెలల నుంచి పండుటాకులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. వీసీ ఆదేశాలతో గత నెలలో సచివాలయాల ద్వారా పింఛన్ నగదు పొందగా.. ఇప్పుడు బ్యాంక్‌కు వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. తమపై కక్షగట్టి ముప్పుతిప్పలు పెడుతున్న చంద్రబాబు తీరుపై అభాగ్యులు ఒంటికాలుతో లేస్తున్నారు. 'మేం ఏం పాపం చేశామని.. ఇలా ఇబ్బంది పెడుతున్నాడు' టూ శాపనార్థాలు పెడుతున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

పింఛన్ నగదుకు పాట్లు
- బ్యాంకుల్లో అవ్వాతాతల బారులు
- మండుటెండల్లో దివ్యాంగుల తిప్పలు
- చంద్రబాబు అండ్ కో తీరుపై విరుచుకుపడిన అభాగ్యులు

మా గోడు తప్పదు బాబు



ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇంటి వద్దకే వలంటీరు వచ్చి పింఛన్ నగదు ఇచ్చే వారు. కానీ టీడీపీ నేత చంద్రబాబు పుణ్యమా అని గత రెండు నెలలుగా పింఛన్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మాకు పెన్షన్ ఇవ్వకుండా వలంటీర్లను అడ్డుకుని మా కడుపు కొట్టారు. టీడీపీ వాళ్లకు మాగోడు తగలకుండా పోదు.

– షేక్ జహరాబీ, ఊటుకూరు, సైదాపురం

అవస్థలు పడుతున్నాం



టీడీపీ వాళ్లు ఫిర్యాదు చేశారని గత నెల నుంచి వలంటీర్ రావడం లేదు. సచివాలయం వద్ద పింఛన్ తీసుకోవాలన్నారు. అక్కడ కాపుకాచి తీసుకున్నాం. ఇప్పుడేమో అకౌంట్‌లో వేశామని చెప్పారు. నాకు బ్యాంకు ఖాతా ఉంది. డబ్బు పడిందో లేదో తెలియదు. ఉదయం నుంచి బ్యాంకు వద్దనే పడిగాపులు కాస్తున్నా. జనం మాత్రం తగ్గడం లేదు. ముసలోళ్లని ఇలా చేస్తే మా ఉసురు తప్పక తగులుతుంది.

– కదిరి జయమ్మ గుండవోలు, రాపూరు

బాబు వల్లే మాకు ఈ కష్టాలు



ప్రతినెలా ఒకటో తేదీనాడే వలంటీర్లు మా ఇళ్ల వద్దకొచ్చి పింఛన్ ఇచ్చే వారు. చంద్రబాబు, ఆయన అనుచరుల కారణంగా నేడు మేము నానా కష్టాలు పడుతున్నాం. ఈనెలలో మాకు పింఛను బ్యాంకు అకౌంట్లలో జమచేసినట్టు చెప్పారు. పింఛను కోసం మండుటెండలో బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ వయసులో మేము ఇలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి రావడం ఎంతో కష్టంగా ఉంది. ఇలా మమ్మల్ని ఇబ్బంది పెట్టి చంద్రబాబు ఏం సాధిస్తాడో..? అర్థం కావడంలేదు. ఈ కష్టాలకు కారణమైన బాబుకు మా ఉసురు తగలక పోదు.

– వీరదాసరి రమణమ్మ, కలువాయి

భయమేస్తోంది



ఒకటో తేదీన తెల్లవారుజామునే ఇంటి తలుపు తట్టి పెన్షన్ సొమ్ము ఇచ్చే వలంటీర్లను తీసేశారు. ఇప్పుడు బ్యాంకు వద్దకు వెళ్లితే ఆ జనాన్ని చూస్తే భయమేస్తోంది. ఆ క్యూలో నిలుచుకునే ఓపిక కూడా లేదు. నిరుపేదలను కష్టపెట్టే వారికి మా గోడు తప్పక తగలుతుంది బాబు.

– వెంకటాద్రి, పెట్లూరు, వెంకటగిరి మండలం

బ్యాంక్‌కు ఎలా వెళ్లగలను



ఈ నెల పింఛన్ బ్యాంకులో వేశారని తెలిసింది. బ్యాంకుకు వెళ్తే నా ఆధార్ కార్డు మొబైల్ నంబర్ లింకు కాలేదని తిప్పిస్తున్నారు. నేను నరాలు బలహీనతతో బాధపడుతున్నాను. నాకు నడవలేని పరిస్థితి. ఇతరుల సహాయం లేకుండా గడప దాటలేను. ఈ పరిస్థితిలో నేను బ్యాంకు వరకు ఎలా వెళ్లగలను. ఇది వరకు ఒకటో తేదీ వస్తుందంటే పింఛన్ ఇంటికి వస్తుందని సంతోషంగా ఉండేది. ఇప్పుడు పింఛన్ ఎలా తీసుకోవాలని భయమేస్తోంది.

– శశి, నాగలాపురం

బాబుకు మా ఉసురు తగులుతుంది



వలంటీర్లతో పింఛన్ల పంపిణీ ఆపివేయడంతో నాకు ఈ నెల పింఛన్ అందలేదు. బ్యాంకుకు వెళ్లి తెచ్చుకోవాలని చెప్పడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లే స్థితిలో లేని నా ఆవేదన వర్ణనాతీతం. ఉద్యోగులు లాగే మాకు వచ్చి పింఛన్లు ఇచ్చేవాళ్లు. ఏ దిక్కూ లేని మాకు జగన్‌బాబే దిక్కయ్యారు. ఆయన ఇస్తున్న పింఛన్‌కు అడ్డు పడుతున్న వాళ్లు మా ఇళ్లకు వచ్చి పింఛన్ ఇస్తారా. మంచి చేయడం చేతకాక పోయినా చేసే వాళ్లను చెడగొట్టడం నీచమైన పని. చంద్రబాబుకు మా ఉసురు తగులుద్ది.

–సుబ్రమణ్యం, కంచనపుత్తూరు, బుచ్చినాయుడుకండ్రిగ

ముసలోళ్ల గోడు వెంటాడుతుంది



మా ముసలోళ్ల పింఛన్‌పై చంద్రబాబు రాజకీయం చేయడం ఏమిటి. వేకువజామున తలుపుతట్టి 5 గంటలకే గ్రామ వలంటీర్లు ఇది వరకు పింఛన్ అందజేసేవారు. అయితే ఎన్నికల సాకుతో వలంటీరు వ్యవస్థను నిలుపుదల చేయించిన చంద్రబాబుకు మేము ఓట్ల రూపంలో బుద్ధి చెప్పుతాము. గత నెలలో సచివాలయాల దగ్గర ఇస్తే.. ఈ నెల బ్యాంకుల్లో జమచేశారని చెప్పారు. బ్యాంకు ఉన్న మండల కేంద్రానికి నేను నివాసం ఉన్న గ్రామానికి 10 కిలో మీటర్లు దూరం. అసలే మండుటెండల్లో నాలాంటి వృద్ధాప్యం ఉన్నవారు బ్యాంకులో క్యూలో నిలబడి తీసుకోవడం ఎంత కష్టం. ఇంతగా కష్టపెడుతున్న మా వృద్ధుల గోడు చంద్రబాబును వెంటాడక తప్పదు. ఎప్పుడు ఎప్పుడని జగనయ్య ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నాం.

– సరోజనమ్మ, నెలటూరు, వరదయ్యపాళెం మండలం

మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి



చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాలు, పోస్టు ఆఫీసు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాసేవాళ్లం. చంద్రబాబు కుట్రలతో మళ్లీ నేడు చంద్రబాబు పాలన గుర్తుకు వస్తోంది. వయసు మీదపడి నిరక్షరాస్యులమైన మేము నగదు ఎలా తీసుకోవాలి..? కనీసం బ్యాంకుల వద్ద నగదు తీసుకునేందుకు విత్‌డ్రా ఫారమ్ రాసి ఇచ్చే దిక్కులేదు. వందల కొద్దీ పింఛన్‌దారులు ఒక్కసారిగా బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య మేము పింఛన్ తీసుకోవడం సాధ్యమేనా.

– అమ్మణమ్మ తాగేలి, వరదయ్యపాళెం మండలం



బుచ్చినాయుడుకండ్రిగ : సహాయకురాలిని వెంటబెట్టుకుని ఐదు కి.మీ నడుచుకుంటూ బ్యాంక్ వద్దకు వస్తున్న వృద్ధురాలు



కలువాయి: గురువారం ఉదయాన్నే బ్యాంక్ ముందు ఉన్న దివ్యాంగురాలు

మా లాంటి ముసలోళ్లపై ఎందుకు పగ



వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు మాలాంటి వారిపై ఎందుకు పగ పెంచుకున్నాడో తెలియదు. గత నెలలో సచివాలయం కాడికి పోయి పింఛన్ డబ్బులు తెచ్చుకున్నాం. ఇప్పుడు బ్యాంకుకు పోవాలని చెప్పారు. అక్కడికి వెళితే సాయంత్రం ఇస్తామన్నారు. బ్యాంకు దగ్గరకు పోయి వచ్చిన దానికి రూ.100 ఖర్చు అయ్యింది. మళ్లీ ఇంకో సారి పోవాలంటే మరో రూ.100 కావాలి. ఇలా పింఛనులో రూ.200 పోతే మిగిలిన దానితో మందులు, పూట గడవడం ఎలాగో తెలియడం లేదు.

– జయమ్మ ఏరూరు, చిల్లకూరు



వాకాడు : యూనియన్ బ్యాంక్ వద్ద పడిగాపులు కాస్తున్న పండుటాకులు



రాపూరు : బ్యాంకులో క్యూకట్టిన జనం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



నుజ్జునుజ్జు అయిన కారు(ఇన్‌సెట్) సంఘటనా స్థలంలో మృతిచెందిన కారు డ్రైవర్, లలిత్ కుమార్ సింఘాల్ (ఫైల్), అంజు సింఘాల్ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం.. మహారాష్ట్ర, ముంబయ్ ఒబెరాయ్ గార్డెన్ సిటీకి చెందిన లలిత్ కుమార్ సింఘాల్(57), చెన్నైలోని మెక్‌లాడ్జ్ ఫార్మా కంపెనీలో ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భార్య అంజు సింఘాల్(52)తో కలిసి కారులో తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతుండగా మేర్లపాక వద్ద ఎదురుగా వస్తున్న తమిళనాడు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులోని లలిత్‌కుమార్ సింఘాల్, భార్య అంజు సింఘాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ భార్యాభర్తలను చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. డ్రైవర్ వివరాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

కబ్జా రాయుడు.. బొజ్జల సుధీరుడు!

- బినామీ పేర్లతో వందలాది ఎకరాలు హాంఫట్
- ఏర్పేడు ఐఐటీ, ఐజర్ భూపరిహారంలో భారీ కుంభకోణం
- నకిలీ పట్టాలు సృష్టించి రూ.కోట్లు స్వాహా



ఏర్పేడు: కోబాక సమీపంలో గోవు పోరంబోకు భూములను ఆక్రమించిన బొజ్జల సుధీర్‌రెడ్డి బినామీలు

- పవిత్ర పుణ్యక్షేత్రంలోని ప్రజలు నమ్మి 30 ఏళ్ల పాటు పాలించే అవకాశాన్ని కల్పించారు..
- ఓటేసిన ప్రజలను నడిసంద్రంలో ముంచేసి అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమార్జనే ధ్యేయంగా సొంత ఆస్తులను కూడబెట్టుకున్నారు..
- తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జాతీయ విద్యాసంస్థలు ఏర్పేడు ఐఐటీ, ఐజర్ భూసేకరణలో భాగంగా రైతులకు అందాల్సిన పరిహారాన్ని బినామీ పేర్లతో కొట్టేశారు.
- ఆ తర్వాత కూడా ప్రభుత్వ భూములపై కన్నేసి వందలాది ఎకరాలను తన అనుచరుల పేర్లతో పట్టాలు చేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు.. శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి.

ఏర్పేడు/రేణిగుంట: రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీ, ఐజర్‌లను నెలకొల్పుతున్నట్లు కేంద్రం 2014లో ప్రకటించింది. ఏర్పేడు సమీపంలోని మేర్లపాక రెవెన్యూ పరిధిలో 548 ఎకరాలు ఐఐటీ కోసం భూసేకరణ చేశారు. అలాగే ఐజర్ కోసం ఏర్పేడు మండలం, జంగాలపల్లి సమీపంలో 260 ఎకరాలు సేకరించారు. ఇదే అదునుగా 2015లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అడ్డదారులు ఎంచుకున్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రెచ్చిపోయారు. అప్పటి తహసీల్దార్ లక్ష్మీనరసయ్యతో కలసి దాదాపు 150 ఎకరాల భూమికి పట్టాలు లేకపోవడంతో అప్పటికప్పుడు పాత తేదీలతో నకిలీ పట్టాదార్ పాసుపుస్తకాలను తయారు చేశారు. ఇంకేముంది.. రూ.కోట్ల పరిహారం మొత్తాన్ని కాజేశారు. అప్పట్లో ఎకరా భూమికి రూ.10లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం అందించింది. ఈ కుంభకోణంలో జంగాలపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు అన్నీ తానై వ్యవహరించారు. ఇలా అక్రమాలకు పాల్పడి అవినీతి సొమ్మును బొజ్జల సుధీర్‌రెడ్డికి ముట్టజెప్పినట్లు అప్పట్లోనే చెడ్డపేరు మూటగట్టుకున్నారు. దీంతో జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో అప్పటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకున్నారు. అలాగే తొట్టంబేడు మండలంలో ఏర్పాటు చేసిన ఖజారియా పరిశ్రమకు కేటాయించిన భూములకు సంబంధించి పొందిన పరిహారంలోనూ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

బినామీ పేర్లతో అన్యాక్రాంతం

శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం, ఇనగలూరు, ఎంపేడు గ్రామాల్లో తన బినామీల పేర్లతో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను బొజ్జల సుధీర్‌రెడ్డి కూడగట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి పట్టాలు చేసుకుని పెద్ద ఎత్తున భూకుంభకోణానికి పాల్పడినట్లు అప్పట్లో జిల్లా అధికారులకు ఫిర్యాదులందాయి. ఆ భూములకు సంబంధించి పట్టాదార్ పాసు పుస్తకాలను బ్యాంకుల్లో పెట్టి పంటరుణాలు పొంది బ్యాంకులను బురిడీ కొట్టించారు. తొట్టంబేడు మండలంలో సైతం తన అనుచరుల పేర్లతో ప్రభుత్వ భూములను పట్టాలు చేసుకుని వాటిని విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఏర్పేడు మండలం కోబాక రెవెన్యూ పరిధిలో గోవు పోరంబోకు భూములను బొజ్జల సుధీర్‌రెడ్డి అనుచరులు అక్రమించి పట్టాలు చేసుకుని సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారు. అనేకమార్లు ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినా ఆక్రమణదారులు ఈ భూములను వదిలిపెట్టలేదు. మళ్లీ బొజ్జల సుధీర్‌రెడ్డికి అధికారం ఇస్తే నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను వదిలిపెట్టడని ప్రజలు చర్చించుకుంటున్నారు.



మన్నవరంలో ఆక్రమించి చదును చేసిన ప్రభుత్వ భూమి

క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తిరుపతి అర్బన్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనల మేరకు వ్యవహరించాలని, రూల్స్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి జానకీరామ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రూల్స్‌ను అతిక్రమిస్తుంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేయదలచిన వారు సూర్యతేజ సెల్ నం.9172119097, అబ్దుల్ ఖాన్-94946 97312 నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో 34 బార్లతోపాటు తిరుపతి డివిజన్ పరిధిలో 145 డిపోలు, ఓజిలి డిపోలో 95, మొత్తం 240 ప్రభుత్వ మద్యం దుకాణాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా రెండు టూరిజం బార్లు, మరో రెండు క్లబ్‌లు ఉన్నాయని చెప్పారు. పర్యావేక్షణ నేపథ్యంలో 27 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. నిత్యం మద్యం సరఫరా, అమ్మకాలు, పర్యవేక్షణ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 49 మందిని ఉద్యోగాల నుంచి తీసివేసినట్లు వివరించారు.

టీడీపీ రెబల్ అభ్యర్థి ప్రచారం



సత్యవేడులో ప్రచారం నిర్వహిస్తున్న రమేష్‌బాబు

సత్యవేడు: అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ రెబల్ అభ్యర్థి యాతాటి రమేష్ బాబు ప్రచార పర్వాన్ని ముమ్మరం చేశారు. గురువారం సత్యవేడు పట్టణంలోని గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, బీసీ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఆదరించిన వారినే దూషిస్తారా?



48వ డివిజన్ జీవకోనలో ఎన్నికల ప్రచారానికి పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష

- ఐదు కోట్ల మంది ఆరాధ్య దైవం జగనన్న
- జగనన్నను దూషించడాన్ని ఆరణి విజ్ఞతకే వదిలేస్తున్నాం
- తిరుపతి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన ఆగ్రహం

తిరుపతి మంగళం: '2019 ఎన్నికల్లో చిత్తూరులో ఆరణి శ్రీనివాసులుకు ఏ పార్టీ టికెట్ ఇచ్చే పరిస్థితి లేదు. అలాంటప్పుడు జగనన్న ఆదరించి టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించారు. ఇప్పుడు తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు జగనన్న పేరు చెప్పుకుని ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులు జగనన్నను నోటికొచ్చినట్లు దూషిస్తున్నారు. ఇది అతని విజ్ఞతకే వదిలేస్తున్నాం' అని.. టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జగనన్న దేవుడని కొలిచి.. ఇప్పుడు జనసేనలోకి మారగానే దెయ్యమయ్యాడా..అని నిలదీశారు. తిరుపతి 15, 20, 48 డివిజన్లలో గురువారం ఆయన మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో వారికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఆరణి శ్రీనివాసులు జీవితం నీచమైనదన్నారు. జగనన్న పేరుతో గెలిచిన ఆరణి చిత్తూరు ప్రజలకు ఏమి చేయకపోవడంతో తిరిగి చిత్తూరులో టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించారని చెప్పారు. టికెట్ ఇవ్వలేదన్న కక్షతో టీడీపీ, జనసేన కూటమిలో చేరి చిత్తూరు ప్రజలను మోసగించారని దుయ్యబట్టారు. రౌడీయిజం, అరాచకాలకు కేరాఫ్ ఆరణి శ్రీనివాసులు అయితే అభివృద్ధే ధ్యేయం, ప్రజాసంక్షేమమే లక్ష్యం భూమన అభినయ్ అభిమతమని తెలిపారు. అరాచకానికి ఓట్లు వేస్తారా? అభివృద్ధికి ఓట్లు వేస్తారా? అన్న విషయాన్ని తిరుపతి నగర ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, కార్పొరేటర్లు తూకివాకం శాలిని, తూకివాకం మహిదర్‌రెడ్డి, రాజమ్మ, వెంకటముని, పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అరకాల సోమశేఖర్‌రెడ్డి, పడమటి కుమార్, ప్రకాష్, మూర్తి, సురేంద్రరెడ్డి, తలారి రాజేంద్ర, రెడ్డెప్పరెడ్డి, రమణమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాండిచ్చేరి మద్యంపై ఆరా



మాట్లాడుతున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సోమయ్య

సూళ్లూరుపేట: ఆంధ్రా–తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లోని తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద బుధవారం స్వాధీనం చేసుకున్న 300 బాక్సుల మద్యం ఎవరదనే విషయం తెలసుకోవడం కోసం పరిశోధనలు చేస్తున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సోమయ్య తెలిపారు. గురువారం ఆయన ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 300 బాక్సులు, 14,400 క్వార్టర్ బాటిళ్ల మద్యం పాండిచ్చేరి నుంచి మనరాష్ట్రంలోకి మినీలారీ ద్వారా తీసుకొస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. పాండిచ్చేరికి చెందిన స్వామినాథ్, షరూన్ అనే ఇద్దరు వ్యక్తులు ఫిరోజ్ అనే డ్రైవర్ ద్వారా ఈ మద్యాన్ని ఏపీలోకి పంపించారని చెప్పారు. ఈ మద్యం ఎన్నికల్లో ఓటర్లకు పంపకానికే అనే విషయం అర్థమవుతోందన్నారు. వెహికల్ డ్రైవర్ ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా స్వామినాథ్, షరూన్ పేర్లు వెల్లడించారని తెలిపారు. ఈ మద్యం విలువ పాండిచ్చేరిలో రూ.7.48 లక్షలు చేస్తుందని, ఇదే మద్యం ఏపీలో అయితే రూ.18 లక్షలు ఉంటుందని తెలిపారు.

పోలింగ్ స్టేషన్‌లో పీఓల పాత్రే కీలకం

- పీఓ డైరీలో ప్రతి అంశాన్నీ నమోదు చేయాలి
- శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ) పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం తిరుపతి నియోజకవర్గం పీఓలు, ఏపీఓలకు తిరుపతి నగరంలోని కచ్చపి మునిసిపల్ ఆడిటోరియంలో రిటర్నింగ్ అధికారి అదిత్‌సింగ్ నేతృత్వంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీలో ఉద్యోగులకు రక్షణ బాధ్యత తమదేనన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను స్పష్టంగా హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచారని చెప్పారు. మరోవైపు ప్రతి అంశాన్నీ పీఓలు డైరీలో రాయాలని సూచించారు. పోలింగ్ డే 13న చేపట్టనున్న నేపథ్యంలో అదేరోజు ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మాక్ పోలింగ్, ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని స్పష్టం చేశారు. తిరుపతి అసెంబ్లీకు 46 మంది పోటీచేస్తున్న నేపథ్యంలో మూడు ఈవీఎం బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. మరోవైపు పార్లమెంట్‌కు 23 మంది పోటీలో ఉండడంతో రెండు ఈవీఎం బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేశారని, మే 12వ తేదీ ఉదయం 7.30 గంటలకు సిబ్బంది హాజరు కావాలని చెప్పారు.

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం





యువతకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)పెంచల కిషోర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం షార్ట్‌ఫిలిం పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొనేందుకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్టు వెల్లడించారు. అందులో భాగంగా తిరుపతి వారి అధ్వర్యంలో స్వీప్ ద్వారా షార్ట్ ఫిలిం పోటీలను నిర్వహించగా.. అందులో 55 మంది యువతీయువకులు పాల్గొన్నారన్నారు. వారు పంపిన 10 షార్ట్ ఫిలింలను ఉత్తమమైనవిగా ఎంపికచేసి జ్ఞాపికలు, ప్రశంశా పత్రాలు అందజేసినట్టు తెలిపారు. అనంతరం జిల్లా స్వీప్ నోడల్ అధికారి వీ.మురళీకృష్ణ కృషిని అభినందించారు.

విలువలతో కూడిన జీవితం ఉన్నతికి సోపానం

తిరుపతి కల్చరల్: సంస్కారంతో పాటు విలువలతో కూడిన జీవితం ఉన్నతికి సోపానమని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ఆచార్య వీ.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సమాజ శ్రేయస్సును కోరుతూ విలువలతో కూడిన అంశాలను రామకృష్ణమిషన్ అందించడం అభినందనీయమని కొనియాడారు. వేసవి సెలవుల నేపథ్యంలో రామకృష్ణ మిషన్ 15 రోజుల పాటు చేపట్టిన సంస్కార శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులకు ఉండాల్సిన అతి ముఖ్యమైన లక్షణం సంస్కారమని, అది చిన్న వయస్సులోనే అలవడాలన్నారు. ఈనెల 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేపట్టే వేసవి సంస్కార శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా సాయంత్రం మహిళలకు పూలమాల తయారీపై శిక్షణ ఇచ్చారు. శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమం ప్రతినిధి స్వామి సత్యస్థానంద పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

తిరుపతి మంగళం: తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ఎర్రచందనం ప్రైవేటు డిపోలను టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుచానూరు – పూడి మార్గంలోని ధ్రువ ప్రొడక్ట్స్‌లో తనిఖీలు నిర్వహించి సంతృప్తివ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళి తదితరులు పాల్గొన్నారు.

దూసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ



తిరుపతి 46వ డివిజన్‌లో జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే భూమన



శ్రీకాళహస్తి : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎస్టీలు

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ దూసుకెళ్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పలువురు కూటమి నేతలు పార్టీలో చేరుతున్నారు. వారికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం, గంగలపూడి, రేణిగుంట మండలంలోని కృష్ణాపురం, శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన 64 టీడీపీ కుటుంబాలు, యానాది సంఘం నాయకులు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు చందమామల కోటయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు అరుణ, రజని, రమాదేవి, వెంకటేశు, సుధీర్, కృష్ణయ్య, వెంకటేష్, చెంగల్‌రాయులు , కంచక్క, రవీంద్ర, శుభరత్న, గంగా, గౌరి, లక్ష్మమ్మ తదితరులున్నారు. కార్యక్రమంలో ఉన్నం వాసునాయుడు, రమణయ్యయాదవ్, నాగముంతల రమేష్, అద్దూరి వెంకటసుబ్బయ్య, కళత్తూరు గుండయ్య, నాగరాజు, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రంగన్నగారిగడ్డలో టీడీపీ వాష్‌ఔట్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని రంగన్నగారిగడ్డ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లె, గువ్వలవారిపల్లె, కురవపల్లె, తొగటపల్లెకు చెందిన పలువురు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ మోహిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జోహార్, మస్తాన్‌వలీ, మాబుసుభాని, సురేష్, మునికృష్ణ, రెడ్డెప్ప, బాల, మోహన్‌రెడ్డి, చంద్రప్ప, రజాక్, పాలగిరి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యువజ్యోతి, మదన్‌మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, వలసారెడ్డి లోకనాథరెడ్డి, సురేంద్రరెడ్డి, మాబుసాహెబ్, శివశంకర్, కేశవరెడ్డి, సిద్ధరామిరెడ్డి, బాలకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

జీవకోనలో జనసేనకు షాక్

తిరుపతి మంగళం: తిరుపతిలో జీవకోనలో యువత జనసేనాకు భారీ షాక్ ఇచ్చారు. జీవకోన 46వ డివిజన్‌లో పార్టీ సీనియర్ నాయకులు పందలూరి పెంచులయ్య, పందలూరి ప్రసాద్ ఆధ్వర్యంలో భారీగా జనసేన నుంచి యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. జీవకోనలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్నను సీఎంగా, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌ని గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు ఆటోప్రసాద్, బాల, యువత పాల్గొన్నారు

40 కుటుంబాలు చేరిక

గూడూరురూరల్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని 28వ వార్డు ఎగువ వీరారెడ్డిపల్లి ప్రాంతం నుంచి 40 కుటుంబాల వారు టీడీపీని వీడి చెగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జేసీఎస్ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చేవూరు విజయమోహన్‌రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాసిన నాగులు, వాయుగుండ్ల నాగరాజు, మండ్ల సురేష్‌బాబు, రాజేష్‌కుమార్, జహీర్, సుభాన్, శ్రీధర్‌రెడ్డి, సువ్వారు నరేష్‌రెడ్డి, వెంకటేష్, జగదీష్‌కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

కిలివేటి సమక్షంలో 50 కుటుంబాలు చేరిక

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలూరు దశరథరామి రెడ్డి సారథ్యంలో నాయుడుపేట పట్టణంలోని రజక కాలనీకి చెందిన 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయుడుపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుంటామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవారెడ్డి విజయలురెడ్డి, బాబి, సాధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మేరిగ మురళీధర్, నాయకులు



నాయుడుపేట : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య